# సెమీస్‌కు భారత్!



పాండ్యా (50 నాటౌట్)

టీ20 ప్రపంచకప్‌లో భారత్ అజేయ ప్రస్థానం కొనసాగుతున్నది. మ్యాచ్ మ్యాచ్‌కు తమ సత్తాఏంటో చూపిస్తూ కప్ వేటలో దూసుకెళుతున్నది. సూపర్-8 తొలి పోరులో అఫ్గానిస్థాన్‌ను చిత్తుచేసిన భారత్..మలి పోరులో బంగ్లాదేశ్ భరతం పట్టింది. మెగాటోర్నీలో తమ గెలుపు రికార్డుకు మెరుగులు అద్దుకుంటూ టీమ్‌ఇండియా విజయఢంకా మోగించింది. ఆస్ట్రేలియాతో మరో మ్యాచ్ మిగిలుండగానే అనధికారికంగా సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. హార్దిక్ పాండ్యా ధనాధన్ అర్ధసెంచరీకి తోడు కోహ్లీ, పంత్, దూబే రాణించడంతో భారీ స్కోరు అందుకున్న భారత్..బౌలింగ్‌లోనూ మెరుపులు మెరిపించింది. కుల్దీప్‌యాదవ్ స్పిన్ తంత్రానికి తోడు బుమ్రా, హార్దిక్, అర్ష్‌దీప్ జతకలువడంతో బంగ్లాకు ఓటమి ఖరారైంది.

**బంగ్లాదేశ్‌పై భారీ విజయం • రాణించిన హార్దిక్, కుల్దీప్, బుమ్రా • టీ20 ప్రపంచకప్ టోర్నీ**

నార్త్‌సౌండ్(అంటిగ్వా): ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో భారత్ అదరగొడుతున్నది. తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకునే క్రమంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 50 పరుగుల తేడాతో బంగ్లాపై ఘన విజయం సాధించింది. దీని ద్వారా గ్రూపు-1లో ప్రస్తుతం 4 పాయింట్లతో టాప్‌లోకి దూసుకొచ్చింది. భారత్ నిర్దేశించిన 197 పరుగుల లక్ష్యఛేదనలో బంగ్లా 8 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్(3/19) మూడు వికెట్లతో విజృంభించగా, బుమ్రా(2/13), అర్ష్‌దీప్‌సింగ్(2/30), హార్దిక్(1/32) రాణించారు. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్(40) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తొలుత బంగ్లాకు టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 196/5 స్కోరు చేసింది. హార్దిక్ పాండ్యా(27 బంతుల్లో 50 నాటౌట్, 4ఫోర్లు, 3సిక్స్‌లు), కోహ్లీ(37), పంత్(36), శివమ్ దూబే(34) సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. 108 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన దశలో పాండ్యా, దూబే బ్యాట్లు ఝులిపించారు. హార్దిక్ పాండ్యాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈనెల 24న ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్: 20 ఓవర్లలో 196/5(పాండ్యా 50 నాటౌట్, కోహ్లీ 37, తంజిమ్ 2/32, రిషాద్ 2/43), బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 146/8(నజ్ముల్ 40, తంజిద్ 29, కుల్దీప్ 3/19, బుమ్రా 2/13)

**పాండ్యా ఫటాఫట్:**

మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఒకింత మెరుగైన శుభారంభమే దక్కింది. ఓపెనర్లు రోహిత్‌శర్మ(23), కోహ్లీ దూకుడుగానే ఇన్నింగ్స్ ప్రారంభించారు. ఫామ్‌లేమితో ఇబ్బంది ఎదుర్కొంటున్న కోహ్లీ సిక్స్‌తో తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పగా, రోహిత్ కూడా పోటీకి వచ్చాడు. షకీబ్ వేసిన ఇన్నింగ్స్ 4వ ఓవర్లో సిక్స్, ఫోర్‌తో జోరు మీద కనిపించిన రోహిత్..భారీ షాట్‌కు ప్రయత్నించి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి టీమ్‌ఇండియా వికెట్ కోల్పోయి 53 పరుగులు చేసింది. కోహ్లీ, పంత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కుదురుగా సాగుతున్న ఆటను తంజిమ్ హసన్ దెబ్బతీశాడు. మూడు బంతుల వ్యవధిలో కోహ్లీ, సూర్యకుమార్(6) ఔట్ చేసి బంగ్లాను పోటీలోకి తీసుకొచ్చాడు. కోహ్లీ క్లీన్‌బౌల్డ్ కాగా, సూర్య...కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఓవైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..పంత్ పోరాటపటిమ కనబరిచాడు. వరుస ఓవర్లలో 4,6, 4, 6,4తో జోరుమీద కనిపించిన పంత్‌ను రిషాద్ హుస్సేన్ పెవిలియన్ పంపాడు. ఇక్కణ్నుంచి ఇన్నింగ్స్ బాధ్యతను పాండ్యా, దూబే భుజానేసుకున్నారు. వీరిద్దరు ఆచితూచి ఆడుతూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరుబోర్డుకు పరుగులు జతచేశారు. బౌండరీ విషయంలో ఈ ఇద్దరు పోటీపడ్డారు. కుదురుకున్న తరుణంలో భారీ షాట్ కోసం ప్రయత్నించిన దూబే క్లీన్‌బౌల్డ్ కాగా, పాండ్యా దూకుడు ఆపలేదు. చూడచక్కని బౌండరీలతో 27 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ క్రమంలో దూబేతో ఐదో వికెట్‌కు 53 పరుగులు, ఆరో వికెట్‌కు అక్షర్‌తో కలిసి పాండ్యా 35 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు.

**బంగ్లా తడబాటు:**

భారీ లక్ష్యఛేదనలో బంగ్లా తడబడింది. భారత బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో బంగ్లా బ్యాటర్లకు కళ్లెం వేశారు. కుల్దీప్‌యాదవ్ స్పిన్ మాయాజాలానికి తోడు పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్‌సింగ్ విజృంభణతో బంగ్లా జట్టు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఓవైపు ఛేదించాల్సిన లక్ష్యం భారీగా ఉండటం...క్రీజులో ఎవరూ నిలదొక్కుకోలేక పోవడం బంగ్లా గెలుపు అవకాశాలను దెబ్బతీసింది. నజ్ముల్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా, సహచర బ్యాటర్ల నుంచి సరైన సహకారం కరువైంది.



## సురేఖకు స్వర్ణం

**ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీ**

అంటాల్య(టర్కీ): పారిస్ ఒలింపిక్స్‌కు ముందు భారత మహిళల ఆర్చరీ టీమ్ సత్తాచాటింది. ఆర్చరీ ప్రపంచకప్ మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో వెన్నెం జ్యోతిసురేఖ, అదితి స్వామి, పర్నీత్‌కౌర్‌తో కూడిన భారత త్రయం పసిడి పతకంతో మెరిసింది. శనివారం జరిగిన కాంపౌండ్ టీమ్ ఫైనల్లో భారత్ 232-229తో లిసెల్ జట్మ, మిరీ మరీ, మారిస్ టెట్స్‌మన్(ఇస్తోనియా)పై అద్భుత విజయం సాధించింది. మెగాటోర్నీలో స్వర్ణం సాధించడం సురేఖ, అదితి, పర్నీత్‌కౌర్‌కు వరుసగా మూడోసారి కావడం విశేషం. మరోవైపు పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత ఫైనల్లో ప్రియాంశ్ 148-149తో మైక్ స్కోలెస్సర్(నెదర్లాండ్స్) చేతిలో ఓడి రజత పతకం ఖాతాలో వేసుకున్నాడు.

## నాగల్‌కు పారిస్ బెర్తు

**అధికారికంగా ఖరారు**



చెన్నై: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నాగల్ అధికారికంగా బెర్తు దక్కించుకున్నాడు. తాజాగా ముగిసిన హెల్‌బ్రోన్ చాలెంజ్ టోర్నీలో విజేతగా నిలువడం ద్వారా ర్యాంకింగ్స్‌లో టాప్-80లోకి దూసుకురావడం కలిసి వచ్చింది. విశ్వక్రీడలకు అర్హత సాధించడంపై నాగల్ ఎక్స్ ద్వారా శనివారం అభిమానులతో పంచుకున్నాడు. 'పారిస్ ఒలింపిక్స్‌కు అధికారికంగా బెర్తు సాధించడం చాలా సంతోషంగా ఉంది. నా హృదయంలో ఒలింపిక్స్‌కు ఎప్పుడు ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. టోక్యో తర్వాత పారిస్ ఆడాలన్న లక్ష్యంతో ముందుకు సాగడం కలిసి వచ్చింది' అని అన్నాడు.

# విండీస్ ధమాకా

**యూఎస్ఏపై భారీ విజయం • హోప్, చేస్, రస్సెల్ విజృంభణ**



చేస్ (3/19)



హోప్(82 నాటౌట్)

బ్రిడ్జ్‌టౌన్(బార్బడోస్): టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య వెస్టిండీస్ అదరగొట్టింది. సొంతగడ్డపై ముచ్చటగా మూడోసారి మెగాటోర్నీని ముద్దాడాలని చూస్తున్న విండీస్..ఆ దిశగా దూసుకెళుతున్నది. ఇంగ్లండ్ చేతిలో ఓటమి నుంచి త్వరగానే తేరుకున్న విండీస్..టోర్నీలో ముందంజ వేయాలంటే తప్పక గెలువాల్సిన మ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. శనివారం సూపర్-8లో భాగంగా యూఎస్ఏతో జరిగిన పోరులో విండీస్ 9 వికెట్ల తేడాతో(55 బంతులు మిగిలుండగానే) భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. దీంతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒక గెలుపు, ఒక ఓటమితో విండీస్ ప్రస్తుతం రెండో స్థానంలో కొనసాగుతున్నది. మ్యాచ్ విషయానికొస్తే..యూఎస్ఏ నిర్దేశించిన 129 పరుగుల స్వల్ప లక్ష్యఛేదనలో విండీస్ 10.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 130 పరుగులు చేసింది. ఓపెనర్ షాయ్ హోప్(39 బంతుల్లో 82 నాటౌట్, 4ఫోర్లు, 8సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో కదంతొక్కాడు. యూఎస్ఏ బౌలర్లను చీల్చిచెండాడుతూ హోప్ బౌండరీల వర్షం కురిపించాడు. తొలి వికెట్‌కు జాసన్ చార్లెస్(15)తో కలిసి 67 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన హోప్..నికోలస్ పూరన్(27 నాటౌట్)తో కలిసి గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశాడు. తన ఇన్నింగ్స్‌లో 4ఫోర్లు, 8 భారీ సిక్స్‌లు బాదిన హోప్..జట్టు విజయంలో కీలకమయ్యాడు. హర్మీత్‌సింగ్(1/18)కు ఒక వికెట్ దక్కింది. తొలుత రోస్టన్ చేస్(3/19), రస్సెల్(3/31) ధాటికి యూఎస్ఏ 19.5 ఓవర్లలో 128 పరుగులకు కుప్పకూలింది. విండీస్ బౌలర్ల ధాటికి యూఎస్ఏ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోలేక పోయారు. గౌస్(29), నితీశ్‌కుమార్(20) ఆకట్టుకున్నారు. మూడు వికెట్లు తీసిన చేస్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

**నేడు భారత్, దక్షిణాఫ్రికా మూడో వన్డే**



బెంగళూరు: సొంతగడ్డపై భారత మహిళల క్రికెట్ జట్టు అదరగొడుతున్నది. మరోమ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమ్‌ఇండియా ఆదివారం జరిగే మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని చూస్తున్నది. గత మ్యాచ్‌లో పరుగుల వరద పారిన నేపథ్యంలో ఆఖరి పోరులోనూ బ్యాటర్ల హవా కొనసాగే అవకాశముంది. ముఖ్యంగా నాయక ద్వయం హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మందన సూపర్ ఫామ్ మీదుండటం టీమ్‌ఇండియాకు కలిసి రానుంది. సఫారీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ కౌర్, మందన బ్యాటింగ్ జోరు కొనసాగిస్తున్నారు. మరోవైపు దక్షిణాఫ్రికాను తక్కువ అంచనా వేసేలా కనిపించడం లేదు. రెండో వన్డేలో కెప్టెన్ వోల్వార్డ్, మారిజానె కాప్ సెంచరీలతో టచ్‌లోకి వచ్చారు.

# పారిస్‌లో పతకమే లక్ష్యం..

**స్టార్ షూటర్ ఇషాసింగ్**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమని తెలంగాణ స్టార్ షూటర్ ఇషాసింగ్ పేర్కొంది. శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇషా మాట్లాడుతూ 'విశ్వక్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలన్న స్వప్నం నెరవేరింది. ప్రత్యర్థి షూటర్లతో పోటీపడుతూ పతకం సాధించడమే ఇక మిగిలి ఉంది. ఏడేండ్లుగా పడుతున్న కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది. ఒలింపిక్స్ ట్రయల్స్ కోసం పడిన శ్రమ ఇప్పటి వరకు ఎప్పుడు పడలేదు. పారిస్ విశ్వక్రీడల్లో పతకం సాధించి మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడిస్తానన్న గట్టి నమ్మకం ఉంది' అని అంది.

# సెమీస్‌లో సహజ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: అమెరికా వేదికగా జరుగుతున్న ఐటీఎఫ్ మహిళల టెన్నిస్ టోర్నీలో తెలంగాణ యువ ప్లేయర్ సహజ యమ్లపల్లి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సహజ 6-1, 6-1తో ఒలీవియా లిన్సర్(పోలండ్)పై అలవోక విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన సహజ..వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించింది.

**చిత్రం**



# తారక్ అసాధారణ ప్రతిభాశాలి

ఎన్టీఆర్ 'దేవర' చిత్రానికి పనిచేస్తుండటంపై బాలీవుడ్ స్టార్ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్ ఆనందం వెలిబుచ్చారు. ఎన్టీఆర్‌తో పనిచేయడం పట్ల ఎగ్జయిట్ అవుతూ తన ఇన్‌స్టాలో తారక్‌తో కలిసి దిగిన ఫొటోలను షేర్ చేశారు బాస్కో మార్టిన్. బాలీవుడ్‌లో కొరియోగ్రాఫర్‌గా బాస్కో మార్టిన్‌ది ప్రత్యేకస్థానం. పఠాన్, వార్, ఫైటర్ చిత్రాల్లో ఆయన కంపోజ్ చేసిన అద్భుతమైన నృత్యరీతులు ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం ఆయన 'దేవర' సినిమాకు పనిచేస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ సినిమాలోని ఓ పాటకు బాస్కో మార్టిన్ కొరియోగ్రఫీ అందించనున్నారు. ఈ పాట చిత్రీకరణ కోసం టీమ్ థాయిలాండ్ వెళ్లింది. అక్కడ తారక్‌తో దిగిన ఫొటోలనే ఆయన ఇన్‌స్టాలో షేర్ చేశారు. తారక్ అసాధారణ ప్రతిభాశాలి అని, అతనితో పనిచేయడం గొప్ప అదృష్టమని బాస్కో మార్టిన్ అన్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందుతోంది. సెప్టెంబర్ 27న తొలిభాగం విడుదల చేస్తారు. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం విదితమే.

# వాస్తవ ఘటనల 'తండేల్'



నాగచైతన్య మత్స్యకారుడి పాత్రలో నటిస్తూ నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. ఇటీవల ఈ చిత్రం శ్రీకాకుళం షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. విశాఖపట్నం, శ్రీకాకుళంలోని సుందరమైన లొకేషన్లలో కీలకమైన ఘట్టాలను తెరకెక్కించారు. సన్నివేశాల్లో వాస్తవికత ప్రతిబింబించేలా స్థానిక మత్స్యకారులను షూటింగ్‌లో భాగం చేశారు. అనూహ్య పరిస్థితుల్లో పాకిస్తాన్ సైన్యం చేతిలో బందీ కాబడ్డ భారత జాలరులు అక్కడి నుంచి ఎలా బయటపడ్డారు? దేశభక్తిని గుండెల్లో నింపుకున్న ఆ మత్స్యకారుల బృందం చేసిన సాహసాలేమిటన్నదే ఈ చిత్ర కథాంశం. ఇప్పటికే రిలీజ్ చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించిందని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత బన్నీ వాసు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, సమర్పణ: అల్లు అరవింద్, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.

# భారీ రన్‌టైమ్‌తో భారతీయుడు-2

కొన్ని రోజులుగా సరైన విజయాలు లేక ఇబ్బందిపడ్డారు కమల్‌హాసన్. అయితే.. ప్రస్తుతం ఆయన టైమ్ నడుస్తున్నది. కమల్ 'విక్రమ్' సినిమా ఆరువందలకోట్ల వసూళ్లను రాబట్టి, ఆయన కెరీర్‌లోనే భారీ విజయంగా నిలిచింది. ఈ నెల 27న 'కల్కి 2898'తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు కమల్. ఇందులో ఆయన సుప్రీం యాస్కిన్‌గా ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా వేడి చల్లారకముందే.. 'ఇండియన్ 2'ని కూడా సిద్ధం చేసేశారు కమల్‌హాసన్. వచ్చేనెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా తెలుగునాట 'భారతీయుడు-2' పేరిట రిలీజ్ కానుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా గురించి ఓ తాజా వార్త వినిపిస్తున్నది. స్వతహాగా శంకర్ సినిమాలు కాస్త నిడివి ఎక్కువగా ఉంటాయి. 'ఇండియన్- 2' నిడివి ఇంకాస్త ఎక్కువని తెలుస్తున్నది. ఏకంగా 3 గంటల 10 నిమిషాల నిడివి వచ్చిందట ఈ సినిమా. అంతేకాదు, 'ఇండియన్-2'కు సెన్సార్‌వారు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చారట. ఇప్పటికే ఓవర్సీస్‌లో బుకింగ్స్ మొదలయ్యాయి. అక్కడ్నుంచి వచ్చిన సమాచారమే ఇది. కమల్, మణిరత్నం కాంబినేషన్‌లో 'థగ్‌లైఫ్' అనే సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే.



# బాలీవుడ్ ప్రతిష్ఠాత్మక చిత్రంలో సమంత?



వరుణ్‌ధావన్‌తో సమంత నటించిన 'సిటాడెల్' సిరీస్ షూటింగ్ పూర్తి చేసుకొని త్వరలోనే స్ట్రీమింగ్‌కి రానుంది. మరోవైపు తన సొంత సినిమా 'మా ఇంటి బంగారం' కూడా సామ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే బాలీవుడ్ నుంచి సమంతకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త వినిపిస్తున్నది. షారుక్‌ఖాన్ సరసన సామ్ నటించనున్నదట. దేశభక్తితో కూడిన యాక్షన్ అడ్వంచరస్ కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రానికి రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వం వహించనున్నట్టు వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. వచ్చే నెలలోనే ఈ సినిమా ప్రకటన రానున్నదట. షారుక్, రాజ్‌కుమార్ హీరానీ కాంబినేషన్‌లో రీసెంట్‌గా వచ్చిన 'డంకీ' సినిమా వాణిజ్యపరంగా పెద్దగా మెప్పించకపోయినా, విమర్శకుల ప్రశంసలందుకుంది. మరోసారి ఈ కాంబినేషన్‌లో సినిమా అంటూ.. అందులో సమంత కథానాయిక అంటూ వస్తున్న వార్తల్లో నిజం ఎంతో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే..






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.